ఆసుపత్రుల్లో గ్యాస్ మంట

- సిలిండర్ల కొరతతో వంటకు ఇబ్బందులు
- కట్టెల పొయ్యిపైనే చేస్తున్న నిర్వాహకులు

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: పశ్చిమాసియాలో యుద్ధం సెగ దేశంలోని అనేక మందికి తగులుతోంది. గ్యాస్ సిలిండర్ల కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్యాస్ కొరత వల్ల చిన్న కుటుంబానికే ఇబ్బందులు తప్పడం లేదు. ఇలాంటిది రోజుకు వెయ్యి మందికి భోజనం వడ్డించే వారి పరిస్థితి చెప్పనక్కర్లేదు. అయినప్పటికీ అనేక కష్టాలుపడి నెట్టుకొస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో భోజనం ఏజెన్సీలు గతనెల రోజుల నుంచి కట్టెల పొయ్యిపై వంటలు చేసి రోగులకు వడ్డిస్తున్నాయి.

నిత్యం 350 మందికి వంట

✦ నంద్యాల సర్వజన ఆసుపత్రిలో పూటకు 300 నుంచి 350 మందికి భోజనం వడ్డిస్తున్నారు. అంటే రోజు మూడు పూటలకు సుమారు వెయ్యి మందికి మెనూ ప్రకారం భోజనం పెట్టాల్సిందే. నిత్యం బాలింతకు రూ.100, సాధారణ రోగులకు రూ.78 లెక్కన ప్రభుత్వం బిల్లు ఇస్తుంది.

✦ ఆసుపత్రిలో వంటలకు రోజుకు ఒక గ్యాస్ సిలిండర్ అవసరం అవుతుంది. అన్నం వండేందుకు ఎలక్ట్రికల్ స్టవ్ ఉన్నప్పటికీ ఒక సిలిండర్ అవసరం అయ్యేది. గ్యాస్ సమయానికి రాకపోవడంతో రోజూ ఒక మనుము కట్టెలు రూ.200 ఖర్చు చేసి తెచ్చుకుని మరీ వంట చేస్తూ రోగులకు భోజనం అందిస్తున్నారు.

✦ " గ్యాస్ ఇవ్వాలని ప్రత్యేకంగా ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతి ఇచ్చాం. వాటిని తీసుకెళ్లి గ్యాస్ ఏజెన్సీలకు ఇచ్చాం. ఇప్పటి వరకు మెనూ ప్రకారం నెట్టుకొచ్చాం. ఎలక్ట్రికల్ స్టవ్‌లు ఉండటం వల్ల కొంత ఇబ్బంది తప్పిందని" నిర్వాహకులు బాషా తెలిపారు.

హోటల్‌కు వెళ్లాల్సిందే

✦ **ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే:** ఆత్మకూరు సీహెచ్‌సీలో హోటల్ నుంచి భోజనం ప్యాకెట్లు తెప్పించి బాలింతలకు అందజేస్తున్నారు. సోమవారం ఆత్మకూరు సీహెచ్‌సీలో 30 మంది బాలింతలకు భోజనం వడ్డించారు. భోజనంలో కేవలం అన్నం, సాంబారు మాత్రమే ఉండగా.. ఆకుకూరలు, పప్పు, కూరగాయ కర్రీ వడ్డించలేదు. ఈ భోజనం తినడానికి బాలింతలు ఆసక్తి చూపకపోవడంతో వారి బంధువులు ఇంటి నుంచి భోజనం తెచ్చారు.

✦ **నందికొట్కూరు, న్యూస్‌టుడే:** ఆసుపత్రి సిబ్బంది ఇచ్చిన టోకెన్ తీసుకెళ్లి హోటల్ నుంచి భోజనం తెచ్చుకోవాల్సి ఉంటుంది. వారు ఇచ్చే చాలీచాలని భోజనంతో మమ అనిపిస్తున్నారు. ప్రతి నెల 25 నుంచి 30 ప్రసవాలు నమోదవుతున్నట్లు సిబ్బంది తెలిపారు.

19 మంది డీటీలకు తాత్కాలిక తహసీల్దార్లుగా పదోన్నతులు

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఉమ్మడి కర్నూలు జిల్లాలో పరిపాలనా సౌలభ్యం కోసం 19 మంది ఉప తహసీల్దార్లకు తాత్కాలిక తహసీల్దార్లుగా పదోన్నతులు కల్పించారు. ఈ మేరకు కలెక్టర్ డా.సిరి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. డీటీలు బత్తుల నారాయణరెడ్డి, జె.మల్లికార్జునరెడ్డి, బైలుప్పల నాగరాజు, పెరుమాళ్ల రవిచంద్ర, సన మురళీమోహన్, టి.అబ్దుల్ వహాబ్, ఎం.లక్ష్మీరాజు, పి.వలిబాషా, కె.రవీంద్రనాథ్‌రెడ్డి కర్నూలు జిల్లాకు, కె.ఫకీర్ అహ్మద్, పి.చంద్రశేఖర్, రామిరెడ్డి రాజేశ్‌రెడ్డి, బి.వి.నాగేశ్వరరెడ్డి, జల్ల శివశంకర్‌రెడ్డి, వగ్గ గురునాథం, మంచర్ల శ్రీవాణి, పైరెడ్డి రమాదేవి, ఆర్.హరిత, తొటగిరి అనితలను నంద్యాల జిల్లాకు కేటాయించారు.

❑ కర్నూలు జిల్లాకు కేటాయించిన డీటీలకు తాత్కాలిక తహసీల్దార్లుగా పోస్టింగ్‌లు ఇచ్చారు. హాలహార్వి తహసీల్దారుగా బత్తుల నారాయణరెడ్డి, ఆస్పరికి జె.మల్లికార్జునరెడ్డి, కోడుమూరుకు బైలుప్పల నాగరాజు, కౌతాళంకు పి.రవిచంద్ర, చిప్పగిరికి సన మురళీమోహన్‌ను, హొళగుందకు ఎం.లక్ష్మీరాజు, పెద్దకడుబూరుకు వలిబాషా, మద్దికెరకు కె.రవీంద్రనాథరెడ్డి, టి.అబ్దుల్ వహాబ్‌ను ఆదోని-1 తహసీల్దారుగా, నందవరం తహసీల్దారుగా డిప్యుటేషన్‌పై నియమించారు.

చదవనోళ్లు కొలువుదీరారు

- విద్యుత్తు ఆపరేటర్లుగా నియామకం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో 33/11 కేవీ విద్యుత్తు ఉప కేంద్రాల్లో అనర్హులు తిష్ఠ వేశారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో ఆపరేటర్లుగా కొలువుదీరారు. ఐటీఐ ఎలక్ట్రిషియన్ విద్య అభ్యసించకుండానే నకిలీ ధ్రువపత్రాలు సమర్పించి ఉద్యోగాల్లో చేరారు. కొన్ని ప్రైవేటు కళాశాలల నుంచి దొంగ సర్టిఫికెట్లు తీసుకురావడం, కలర్ జిరాక్స్ తీసి దరఖాస్తు చేసుకొని కొలువుల్లో చేరిపోయారు. పకడ్బందీగా స్క్రూటినీ చేసి, ముఖాముఖీ పరీక్షలు నిర్వహించి ఉద్యోగాల్లోకి తీసుకోవాల్సి ఉండగా. . ఇవన్నీ తూతూమంత్రంగా చేశారు. నాయకులు, అధికారులు, గుత్తేదారులు మిలాఖత్ కావడంతో ఉప కేంద్రాల పరిధిలో కొత్త నియామకాలు ఇదే విధంగా జరిగిపోయాయి.

16 మందిపై వేటు

● కర్నూలు జిల్లాలో 128, నంద్యాలలో 182 విద్యుత్తు ఉప కేంద్రాలు ఉన్నాయి. విద్యుత్తు ఉప కేంద్రాల నిర్వహణ బాధ్యతలను గుత్తేదారులకు అప్పగించారు. నిర్వహణ నిమిత్తం ఆపరేటర్లను నియమించాల్సి ఉంటుంది. ఒక్కో కేంద్రం పరిధిలో నలుగురు షిఫ్ట్ ఆపరేటర్లు ఉండాల్సి ఉంటుంది.

● కేంద్రాల నిర్వహణలో వీరి పాత్ర కీలకం కావడంతో అధికారుల పర్యవేక్షణలో నియామకాలు చేపట్టాలి. ఐటీఐ (ఎలక్ట్రిషియన్ కోర్సు) చదివి, ఎలక్ట్రిషియన్‌గా పని చేసిన అనుభవం, విద్యుత్తు స్తంభాలు ఎక్కే నైపుణ్యాలు వంటివి క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉంటుంది. ఇవేవి పట్టించుకోలేదు.. నకిలీ ధ్రువపత్రాలు సమర్పించినట్లు ఇటీవల విచారణలో తేలడంతో 16 మందిపై సంస్థ సీఎండీ కొరడా ఝుళిపించారు.

ఒక్కో పోస్టుకు రూ.10 లక్షలు

● ఒక్కో ఆపరేటర్, వాచ్‌మ్యాన్, కంప్యూటర్ ఆపరేటర్ తదితర పోస్టులకు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు వసూళ్లు చేశారు. మొత్తం ఇస్తే దళారులే ఐటీఐ సర్టిఫికెట్ తీసుకువచ్చి కొలువు ఇప్పించారు. ఈ మొత్తాన్ని కొంత మంది అధికారులతో పాటు స్థానిక నాయకులు, గుత్తేదారులు పంచుకున్నారు.

● విద్యుత్తు శాఖలో ఏడాది క్రితం నంద్యాల కేంద్రంగా కొత్త సర్కిల్ ఏర్పాటు అయినప్పుడు ఖాళీల పేరిట తొమ్మిది పోస్టులను భర్తీ చేశారు. ఇందులో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయి. ఒక గుత్తేదారుడు మధ్యవర్తిత్వం చేసి అభ్యర్థుల నుంచి భారీగా డబ్బులు వసూలు చేసి నియామక పత్రాలు ఇచ్చారు.

తప్పులు సరిదిద్దుకొనే యత్నం

ఆపరేటర్ల ధ్రువీకరణ పత్రాలను తనిఖీలు చేస్తామని సీఎండీ చెప్పడంతో అప్రమత్తమయ్యారు. కొద్ది నెలల కిందట విజిలెన్స్ అధికారులు ఆరా తీశారు. ఈ నేపథ్యంలో ఆపరేటర్లు ప్రైవేట్ కళాశాలల్లో అడ్మిషన్లు తీసుకొనే పనిలో పడ్డారు. కానీ ఉద్యోగంలో చేరిన సమయంలో వీరు చూపించిన సర్టిఫికెట్లు ప్రస్తుత ధ్రువీకరణ పత్రాలు వేరుగా ఉన్నాయి. కొంత మంది దగ్గర రెండు నుంచి మూడు సర్టిఫికెట్లు ఉన్నాయి. ఆళ్లగడ్డ మండలంలో ఆరుగురు, ఆదోని పట్టణంలో ముగ్గురు, ఎమ్మిగనూరులో ఇద్దరు, నంద్యాల పట్టణంలో నలుగురు, పాణ్యంలో ఇద్దరు దొంగ ధ్రువీకరణ పత్రాలతో కొనసాగుతున్నారు.

చక్రం తిప్పుతున్న గుత్తేదారులు

- గత పదేళ్లలో ఉమ్మడి జిల్లాలో 63 ఉప విద్యుత్ కేంద్రాలు కొత్తగా నిర్మించారు. ఆయా కేంద్రాల్లో నియామకాలన్నీ నాయకుల సిఫార్సుతో జరిగిపోయాయి. 33/11 కేవీతో పాటు 220 కేవీ ఉప కేంద్రాల్లో ఆపరేటర్ల నియామకాల సందర్భంగా పెద్ద మొత్తం చేతులు మారాయి.
- నంద్యాలలో పనిచేస్తున్న ఓ గుత్తేదారుడు ఉప కేంద్రాల నిర్వహణను పక్కనపెట్టి ఆ పేరుతో కేవలం ఆపరేటర్లు, వాచ్‌మెన్లు, కంప్యూటర్ ఆపరేటర్ల నియామకాలు చేస్తూ రూ. కోట్లకు పడగలెత్తారు.
- ఏ ఉప కేంద్రం పరిధిలోనైనా ఉద్యోగి మరణిస్తే ఆ కుటుంబానికి ఎంతో కొంత ఇవ్వడం.. ఆ పోస్టును ఇతరుల నుంచి రూ.10 లక్షల వరకు తీసుకుని భర్తీ చేయడం సాధారణంగా మారిపోయింది. సదరు గుత్తేదారుడే జిల్లాలోని పలు కేంద్రాల్లో 100కు పైగా పోస్టులను భర్తీ చేశారు. ఆదోని, కర్నూలులో ఇద్దరు కాంట్రాక్టర్లు ఇలానే చక్రం తిప్పుతున్నారు.

నేడు భ్రమరాంబాదేవికి కుంభోత్సవం

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: అష్టాదశ శక్తిపీఠ క్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రంలో చైత్రమాసాన్ని పురస్కరించుకొని మంగళవారం భ్రమరాంబాదేవికి వైభవంగా కుంభోత్సవం జరగనుంది.

భూగర్భ జలాల పెంపు అందరి బాధ్యత

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: నీరు వృథా కాకుండా భూగర్భ జలాల పెంపు ప్రతి ఒక్కరి బాధ్యతని, ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా 100 రోజుల ప్రణాళికను అమలు చేస్తుందని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. సోమవారం మండలంలోని సుగాలిమెట్ట, తమ్మరాజుపల్లె గ్రామాల పరిధిలో జలధార-నీటి భద్రత-సాగునీటి సంఘాల బాధ్యత అనే కార్యక్రమంలో మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌తో పాటు జిల్లా కలెక్టర్ రాజకుమారి పాల్గొని పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 100 రోజుల ప్రణాళికతో వర్షపు నీరు వృథా కాకుండా నిల్వను పెంచడంతో పాటు నీటి వనరులు సక్రమంగా వినియోగించుకునేందుకు చర్యలు చేపట్టనున్నారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో ప్యాపిలి మండలంలో 20 మీటర్లకు పైగా లోతులో నీరు ఉండగా, 8 నుంచి 20 మీటర్ల మధ్యలో నీటిమట్టం ఉన్న మండలాలు 9 ఉన్నాయని, జిల్లాలో 165 గ్రామాల్లో నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నాయన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సూర్యనారాయణ, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఇన్‌ఛార్జి తహసీల్దార్ శివశంకర్‌రెడ్డి, నంద్యాల మార్కెట్‌యార్డు కమిటీ చైర్మన్ హరిబాబు పాల్గొన్నారు.

సుగాలిమెట్టలో జలధార నీటి భద్రత పనులను ప్రారంభిస్తున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్, కలెక్టర్ రాజకుమారి

జలసిరికి వందనం

- భూగర్భ జలాలు పెంచేందుకు కసరత్తు
- 100 రోజుల పాటు ప్రత్యేక పనులు

ఈనాడు, కర్నూలు, నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: డోన్ మండలం కొచ్చెరువులో 45.75 మీటర్ల లోతులో.. కోసిగి మండలం వందగల్లులో 29.78 మీటర్ల అడుగున భూగర్భ జలాలు ఉన్నాయి.. మరో 14 మండలాల్లో 'జల'ఘంటికలు మోగుతున్నాయి.. ఇలాంటి పరిస్థితుల నుంచి గట్టెక్కడానికి రాష్ట్ర ప్రభుత్వం 'జలసిరి' జైత్రయాత్రకు శ్రీకారం చుట్టింది. 'నీటి భద్రత-సాగునీటి సంపద బలోపేత' పేరుతో వంద రోజుల పాటు ఉమ్మడి కర్నూలు జిల్లాలో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో కమిటీలు ఏర్పాటుచేసి జలవనరులు, ఇతర శాఖల భాగస్వామ్యంతో భూగర్భ జలాలు పెంచనున్నారు.

పాతాళానికి చేరాయి

భూగర్భజలాలు (లోతు మీటర్లలో)	కర్నూలు (మండలాల సంఖ్య)	నంద్యాల
0-3	2	5
3-8	18	14
8-20	5	9
20	1	1

◀◀ ఉమ్మడి జిల్లాలో ఉపరితల జలాల్లో 90 శాతం వ్యవసాయానికి, 3 శాతం పరిశ్రమలు, మరో 7 శాతం గృహావసరాలకు వినియోగిస్తున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. ఏటా పెరుగుతున్న జనాభాతో నీటి వినియోగం అధికమవుతోంది. జల సంరక్షణకు ఆశించిన స్థాయిలో చర్యలు కానరావడం లేదు. నీటి పొదుపు పాటించకపోవడంతో భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలు తీవ్రం కానున్నాయి.

◀◀ కర్నూలు జిల్లాలోని ఆస్పరి, కల్లూరు, ఓర్వకల్లు, మద్దికెర, ఎమ్మిగనూరు మండలాల్లో, నంద్యాల జిల్లాలోని ఆళ్లగడ్డ, బేతంచెర్ల, చాగలమర్రి, డోన్, కొలిమిగుండ్ల, కొత్తపల్లి, మిడుతూరు, నందికొట్కూరు, పాములపాడులో భూగర్భ జలాలు 8 - 20 మీ. లోతులో ఉన్నాయి. కల్లూరు మండలంలోనూ భూగర్భ జలాలు అడుగంటిపోతోంది.

కనీసం మీటరైనా పెంచాలని..

భూగర్భ జలాల	వినియోగం (టీఎంసీలు)
వర్షపు నీరు	25.860
గృహావసరాలు	1.860
పరిశ్రమలు	6.080
బోరు బావులు	4.210

◀◀ భూగర్భ జలమట్టాన్ని కనీసం ఒక మీటరైనా పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. గరిష్ఠంగా 3 నుంచి 6 మీటర్లు పెంచేలా ప్రణాళికలు రూపొందించింది. చేసే ప్రతి పనిని యాప్‌లో నమోదు చేయనున్నారు. రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు నాలుగు అంచెల కమిటీలు పనుల పురోగతిని సమీక్షిస్తాయి.

◀◀ అధికారులు 10 రోజుల పాటు క్షేత్రస్థాయిలో పర్యటించి పనులు గుర్తిస్తారు. వాటికి ఐదు రోజుల్లో అనుమతులు తీసుకుంటారు. ఆ తర్వాత 80 రోజుల పాటు చేస్తారు. చివరి ఐదు రోజుల్లో నాణ్యతను పరిశీలించి నివేదికలను తయారు చేస్తారు.

◀◀ చెరువులకు నీళ్లు చేర్చే కాల్వలను శుభ్రం చేస్తారు. చెరువుల పునరుద్ధరణలో భాగంగా పూడికతీస్తారు. వాగులు, వంకలపై ఉన్న చెక్‌డ్యాంలను బాగు చేయనున్నారు. అవసరమైతే కొత్త నిర్మాణాలు చేసి కాలువలు, వాగులు, చెరువులకు అనుసంధానం చేస్తారు. సాగునీటి సంఘాలు, గ్రామ పంచాయతీల భాగస్వామ్యంతో నీటి పొదుపుపై అవగాహన కల్పిస్తారు. పనుల్లో ఎక్కడా అవినీతి జరుగకుండా జల వనరుల సమాచార నిర్వహణ (డబ్ల్యూఆర్ఐఎంఎస్) అనే సాంకేతిక వ్యవస్థ ద్వారా పర్యవేక్షిస్తారు.

దాచే చోటులేక దారే కల్లమైంది

ఆళ్లగడ్డ నియోజకవర్గంలో రహదారులు వ్యవసాయ దిగుబడులు ఆరబెట్టేందుకు కల్లాలుగా, నిల్వ చేసుకునేందుకు గోదాములుగా, విక్రయించేందుకు మార్కెట్‌లుగా మారుతున్నాయి. దీంతో రాకపోకలకు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా రైతులు పెడచెవిన పెడుతున్నారు. సోమవారం ఆళ్లగడ్డ శివారులో ప్రధాన రహదారిపైనే మొక్కజొన్న దిగుబడులు వ్యాపారులకు విక్రయించారు. మొక్కజొన్నకు మద్దతు ధర లభించడం లేదు. సోమవారం క్వింటా మొక్కజొన్నను రూ.1730కు విక్రయించారు. మద్దతు ధర రూ.2400 ఉండగా దాదాపు క్వింటాపై రైతు రూ.700 నష్టపోతున్నారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో దళారులు చెప్పిందే ధరగా మారింది.

– న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ

దాటలేక.. ఎండకు తాళలేక

- రైల్వే గేట్ల వద్ద అవస్థలు

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: ఎండలు మండిపోతున్నాయి.. ఉదయం తొమ్మిది గంటలకే బయట అడుగుపెట్టలేని పరిస్థితి.. ఇలాంటి పరిస్థితిలో రైల్వే గేట్ల వద్ద వాహనదారులు అల్లాడిపోతున్నారు. రైల్వే గేట్లు దాటలేక.. ఎండకు తాళలేక అవస్థలు పడుతున్నారు. ఉదయం కార్యాలయాలకు, విద్యాసంస్థలకు వెళ్లే సమయంలో ప్రతి పది, పదిహేను నిమిషాలకోసారి గేట్లు వేస్తుండటంతో ఉద్యోగులు, విద్యార్థులు చాలా సేపు నిరీక్షించాల్సి వస్తోంది. అత్యవసర సేవల వాహనాలూ పలు సందర్భాల్లో రైల్వే గేట్ల వద్ద చిక్కుకుపోతున్నాయి.

మూలసాగరం వద్ద రైల్వే గేటు తీసిన తర్వాత వాహనాల రద్దీ

కాలనీ వాసులు వెళ్లలేక

● పట్టణంలో మూలసాగరం, జ్ఞానాపురం, గాంధీనగర్, బొగ్గులైన్, కాంతినగర్, విజయపురికాలని, దేవనగర్, వీసీ కాలనీ, ఎంఎస్‌నగర్‌తో పాటు పలు ప్రాంతాల ప్రజలు మూలసాగరం గేటు నుంచి వెళ్తుంటారు. నిత్యం 25 వేల మందికిపైగా రాకపోకలు సాగిస్తుంటారు.

● నంద్యాల పొన్నాపురంలో, విజయ పాల డెయిరీ ఎదురుగా రైల్వే గేట్లు ఉన్నాయి. పొన్నాపురం, ఎన్టీవోస్ కాలనీ, అయ్యలూరు, రైతునగరం, నూనెపల్లి, ఏకలవ్యనగర్, ఎస్బీఐ కాలనీ ప్రాంతాల ప్రజలు ఈ గేట్ల గుండా ప్రయాణిస్తుంటారు.

● నంద్యాల బొమ్మల సత్రం వద్ద కర్నూలు వెళ్లే జాతీయ రహదారిలో రైల్వే గేటు ఉంది. ఇక్కడి నుంచి పట్టణంతోపాటు వివిధ గ్రామాలకు చెందిన వారు నిత్యం 30 వేల మంది వరకు ప్రయాణం సాగిస్తుంటారు. పలుమార్లు గేటు వేయడం వల్ల దూర ప్రాంతాలకు వెళ్లే వారికి ఆలస్యం అవుతోంది.

● ఊడుమాల్పూరం వెళ్లే దారిలో రైల్వే గేటు పడితే వెంకటేశ్వరపురం, నంద్యాల, ఆటోనగర్, పోలూరు, వెంకటేశ్వరపురం ప్రాంతాలకు రాకపోకలు సాగించే వారు అరగంట వరకు వేచి ఉండాల్సి వస్తోంది.

ప్రతిపాదనలు దాటని వంతెనలు

నంద్యాల రైల్వేస్టేషన్ మీదుగా నిత్యం 40కి పైగా రైళ్లు, గూడ్స్ రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. పట్టణంలో పొన్నాపురం, విజయ పాల డెయిరీ ఎదుట, మూలసాగరం, బొమ్మలసత్రం కర్నూలు వెళ్లే రహదారిలో, ఊడుమాల్పూరం ప్రాంతాల్లో రైల్వే గేట్లు ఉన్నాయి. ఆయా దారుల్లో నిత్యం వందల మంది రాకపోకలు సాగిస్తుంటారు. వాహనదారుల విన్నపం మేరకు నంద్యాలలో 4 చోట్ల ఓవర్ బ్రిడ్జిలు, 2 అండర్ పాస్‌ల నిర్మాణానికి అధికారులు డీపీఆర్(డిటైల్ ప్రాజెక్టు రిపోర్ట్) సిద్ధం చేసి గుంటూరు డివిజన్ ఉన్నతాధికారులకు పంపారు.

ప్రమాదకరంగా ప్రయాణం

నూనెపల్లె వంతెన కింద రైల్వే కమ్మీలు దాటకుండా రైల్వే అధికారులు రోడ్డుకు ఇరువైపులా గేట్లు వేశారు. వంతెన పైనుంచి చుట్టూ తిరిగి వెళ్లే 15 నిమిషాల సమయం పడుతుండటంతో ప్రజలు ప్రమాదకరంగా రైల్వే కమ్మీలు దాటి వెళ్తున్నారు.

ఊరు వెళ్లాలంటే తిప్పలే

నంద్యాల రైల్వేస్టేషన్ మీదుగా నిత్యం 40కి పైగా రైళ్లు, గూడ్స్ రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. పట్టణంలో పొన్నాపురం, విజయ పాల డెయిరీ ఎదుట, మూలసాగరం, బొమ్మలసత్రం కర్నూలు వెళ్లే రహదారిలో, ఊడుమాల్పూరం ప్రాంతాల్లో రైల్వే గేట్లు ఉన్నాయి. ఆయా దారుల్లో నిత్యం వందల మంది రాకపోకలు సాగిస్తుంటారు. వాహనదారుల విన్నపం మేరకు నంద్యాలలో 4 చోట్ల ఓవర్ బ్రిడ్జిలు, 2 అండర్ పాస్‌ల నిర్మాణానికి అధికారులు డీపీఆర్(డిటైల్ ప్రాజెక్టు రిపోర్ట్) సిద్ధం చేసి గుంటూరు డివిజన్ ఉన్నతాధికారులకు పంపారు.

భక్తుల సొమ్ము బుక్కుతున్నారు

- మల్లన్న ఆలయంలో అక్రమాలు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల దేవస్థానంలో కొందరు ఉద్యోగులు 'దారి' తప్పుతున్నారు. భక్తుల సేవలు మరిచి.. అక్రమార్జనకు తెర తీశారు. ఇటీవల ఓ అధికారి ఆలయ సామగ్రిని నంద్యాలకు తరలించి బేరం పెట్టారు. ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య భారీగా పెరిగింది.. సాధారణ రోజుల్లో 35 వేల వరకు ఉండగా.. సెలవు రోజుల్లో 50 వేలు దాటుతోంది. ఉగాది, శివరాత్రి బ్రహ్మోత్సవాల సమయంలో హుండీ ఆదాయం రూ.5 కోట్ల వరకు ఉంటోంది. ఆదాయంలో సింహ భాగం అభివృద్ధి పనుల పేరుతో ఇంజినీరింగ్ విభాగానికే కేటాయిస్తున్నారు. సామగ్రి కొనుగోళ్లకు భారీగా ఖర్చు పెడుతున్నారు. ఇదే సమయంలో కొందరు ఉద్యోగులు అవకాశం దొరికితే అక్రమార్జనకు పాల్పడుతున్నారు.

స్వామివారి సొమ్మును దొంగిలించి ఒక ఐప్పంద ఉద్యోగి కొనుగోలు చేసిన ద్విచక్రవాహనం

అధికారుల చేతివాటం

▲ శ్రీశైల దేవస్థానంలో సాఫ్ట్‌వేర్‌ను వేదికగా చేసుకొని భారీ ఎత్తున అక్రమాలకు పాల్పడిన వైనం గతంలో వెలుగు చూసింది. ఇద్దరు పొరుగు సేవల ఉద్యోగులు పాస్‌వర్డును మార్చి అవినీతికి తెరతీశారు. ఆర్జిత సేవలు, దర్శనం టికెట్ల సొమ్ముతో పాటు విరాళాలూ స్వాహా చేశారు. రూ.2.12 కోట్ల అవినీతి జరిగినట్లు విచారణాధికారులు గుర్తించారు.

▲ ఆలయంలో పని చేసే ఒప్పంద పరిచారిక ఉద్యోగి ఒకరు స్వామివారి హుండీ సొమ్మునే దొంగిలించి సీసీ కెమెరాలకు అడ్డంగా దొరికిపోయారు. స్వామివారి సొమ్ముతో బుల్లెట్ వాహనం కొనుగోలు చేసి జల్సాలు చేశారు.

▲ దేవస్థానంలోని ఇంజినీరింగ్ విభాగంలో పని చేసే అధికారి ఒకరు సున్నిపెంటలోని బ్రహ్మంగారి గుడి వెనుక బినామీ గృహాన్ని నిర్మించారు. కొందరు గుత్తేదారులపై ఒత్తిడి తీసుకువచ్చి భవనాన్ని నిర్మించడం విమర్శలకు తావిచ్చింది. సదరు బినామీ గృహాన్ని తన కుటుంబ సభ్యుల పేర్లతో మార్చుకోవడానికి సదరు అధికారి విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

▲ దేవస్థానంలో పలుకుబడి కలిగిన మరో ఉద్యోగి పని తీరు ఉన్నతాధికారులకు తలనొప్పిగా మారింది. దుకాణాల కేటాయింపులో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

విజిలెన్స్ లేకపోవడంతో

దేవస్థానంలో కొన్నేళ్ల నుంచి జరుగుతున్న అక్రమాలు, అవినీతిని అడ్డుకట్ట వేయడానికి గతంలో దేవాదాయశాఖ ప్రధాన కార్యాలయంలోని ఉన్నతాధికారులు విచారణకు వచ్చేవారు. ప్రస్తుతం దేవాదాయశాఖ ఉన్నతాధికారులతో విజిలెన్స్ కమిటీ ఏర్పాటు చేయకపోవడం వల్ల అక్రమాలకు అడ్డుకట్ట పడడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇటీవల ఈవో ఎం.శ్రీనివాసరావు దేవస్థానం ఉద్యోగులతో విజిలెన్స్ కమిటీ ఏర్పాటు చేసినా అమలుకు సాధ్యం కాలేదు. స్థానికంగా ఉద్యోగులతో కమిటీ ఏర్పాటు చేయడం కంటే దేవాదాయశాఖ స్థాయిలో విజిలెన్స్ కమిటీ నియమిస్తే కొంత వరకు ఉంటుంది.

మూడు రైళ్ల రద్దు

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : రైల్వేలైను డబ్లింగ్, విద్యుదీకరణ, సిగ్నలింగ్ పనుల కారణంగా పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారి ఎ.శ్రీధర్ సోమవారం తెలిపారు. కాచిగూడ నుంచి కర్నూలు నడిచే రైలు (17435) ఈనెల 10 నుంచి 18వ తేదీ వరకు, కర్నూలు నుంచి కాచిగూడకు వెళ్లే రైలు (17436) 11 నుంచి 19 వరకు, కాచిగూడ నుంచి గుంతకల్లుకు వెళ్లే రైలును (57414) 11 నుంచి 19 వరకు రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు. కర్నూలు నుంచి కాచిగూడకు 3 గంటలకు బయల్దేరాల్సిన రైలు (17204) 13, 15, 17 తేదీల్లో 120 నిమిషాలు ఆలస్యంగా నడుస్తుందని వివరించారు.

ఆధరణ తగ్గిన చీనీ

- కాయలను పొలంలోనే వదిలేస్తున్నారు
- నష్టాల ఊబిలో అన్నదాతలు

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: సాధారణంగా వేసవిలో చీనీ (మోసంబి, స్వీట్ లెమన్) ధర క్వింటా రూ.50 వేలకు తక్కువ కాకుండా పలుకుతుంది. రైతులు, వ్యాపారులకు లాభాలు వచ్చే కాలం.. కానీ ఈ ఏడాది గతంలో ఎన్నడూలేని విధంగా నష్టపోతున్నారు. కోతకొచ్చిన పండ్లను చెట్లపైనే ఉంచాల్సిన దుస్థితి నెలకొంది. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా మామిడి, ఆపిల్, సపోటా, అరటి తదితర పండ్ల ఎగుమతులు ఆగిపోయాయి..వాటిని వ్యాపారులు మన దేశంలో వివిధ రాష్ట్రాలకు పంపిస్తున్నారు.. ఆయా పండ్లపై వినియోగదారులు ఆసక్తి కనబరచడంతో చీనీ పండ్లకు ఆ'ధరణ తగ్గింది.

చెట్లను తొలగిస్తున్నాం

"పంట సాగు చేసిన ఆరేళ్ల తర్వాతి నుంచి పూర్తిస్థాయిలో దిగుబడి ప్రారంభమవుతుంది. ఈ ఆరేళ్లలో పంట సంరక్షణకు ఏటా ఎకరాకు దాదాపు రూ.80వేల ఖర్చవుతుంది. ఏడో ఏడు నుంచి ఎకరాకు రూ.2 లక్షలకుపైగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. మేము 20 ఎకరాల్లో చీనీ తోట సాగు చేశాం. ఈ ఏడాదైనా లాభాలు వస్తాయనుకుంటే యుద్ధం, ఇతర కారణాలతో ధర మరోసారి పడిపోయింది. టన్ను దిగుబడి ధర కేవలం రూ.12 వేలు పలికింది. అందుకే గత్యంతరం లేక 16 ఎకరాల్లో పంటను తొలగించినట్లు" బాచాపురానికి చెందిన మహిళా రైతు నిర్మలాదేవి ఆవేదన వ్యక్తం చేశారు.

ఒక్కసారిగా పడిపోయింది

నంద్యాల జిల్లాలో 1,500 ఎకరాల్లో చీనీ తోటలు సాగవుతున్నాయి. ఆళ్లగడ్డ నియోజకవ

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు 8న

బేతంచెర్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈనెల 8వ తేదీన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శి గుండా అశ్వర్థ నారాయణ, రాజేష్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. చౌడేశ్వరి దేవి ఫంక్షన్ హాలు వెనుక కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విజేతలకు వరుసగా రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేల నగదు బహుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు.

9న మండల సర్వసభ్య సమావేశం

శిరివెళ్ల, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 9న మండల స్థాయి సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శివమల్లేశ్వరప్ప తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎంపీపీ మహమ్మద్ వసీం ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామన్నారు.

పోలీసుల అనుమతి తీసుకోవాలి

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: గ్రామాల్లో నిర్వహించే ర్యాలీలు, బహిరంగ సభలకు పోలీసుల అనుమతులు తీసుకోవాలని సీఐ రమేష్‌బాబు చెప్పారు. ఆయన మాట్లాడుతూ.. పోలీసుల అనుమతులు లేకుండా గుంపులుగా చేరడం, ర్యాలీలు, సభలు, ప్రదర్శనలు చేయటం నిషేధించినట్లు చెప్పారు. మైకులు, లౌడ్ స్పీకర్ల వినియోగంపై ఆంక్షలు అమలులో ఉన్నాయన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లె: 80085 73763

శిరివెళ్ల, న్యూస్‌టుడే: ?: మండలంలోని వెంకటాపురంలో రహదారిపైనే చెత్తను పడేస్తున్నారు. – **నరసింహ, స్థానికుడు.** ✔: చెత్తను రోడ్డుపై వేయకుండా చర్యలు తీసుకుంటాం. – **శ్రీనివాసశర్మ, ఎంపీడీవో.**

ఆళ్లగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: ?: మండలంలోని జి.జంబులదిన్నె గ్రామంలో ఎస్సీ కాలనీలో రోడ్డుపై మురుగు పారుతోంది. – **ప్రకాష్, జి.జంబులదిన్నె.** ✔: పారిశుద్ధ్య చర్యలు చేపడతాం. – **సూర్యహాన్, ఎంపీడీవో.**

బేతంచెర్ల, న్యూస్‌టుడే: ?: మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో గూటుపల్లె వెళ్లే దారిలో హిందూ శ్మశాన వాటిక సమీపంలో ప్రధాన రహదారి పక్కన చెత్తా చెదారం వేయడంతో దుర్వాసన వస్తోంది. – **గూటుపల్లె గ్రామస్థులు.** ✔: చెత్తాచెదారం రోడ్డు పక్కన వేయకుండా చర్యలు తీసుకుంటాం. – **బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి.** ?: పట్టణంలో దుర్గాపేట కాలనీలో బలపాలపల్లె వెళ్లే దారి పక్కన ఉన్న ప్రధాన కాల్వలో చెత్తాచెదారం నిండిపోయింది. – **కాలనీవాసులు** ✔: పారిశుద్ధ్య సిబ్బంది దృష్టికి తీసుకెళ్లి కాల్వను శుభ్రం చేయిస్తాం. – **మధు, శానిటరీ ఇన్‌స్పెక్టర్.**

కోవెలకుంట్ల గ్రామీణం, న్యూస్‌టుడే: ?: ఆంధ్ర బ్యాంకు సమీపంలో నాలుగు రోడ్ల కూడలి వద్ద నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. – **శేఖర్, స్థానికుడు.** ✔: పరిశీలించి తగిన చర్యలు చేపడతాం. – **ప్రకాష్‌నాయుడు, ఇన్‌ఛార్జి ఈవో.**

వేసవిలో ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరి

విద్యార్థులకు సూచనలిస్తున్న డాక్టర్ తస్లీమా

కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

బేతంచెర్ల, న్యూస్‌టుడే: వేసవిలో ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని డాక్టర్ తస్లీమా పేర్కొన్నారు. పట్టణంలో ధరణీ టౌన్‌షిప్‌లోని జడ్పీ ఉన్నత మెయిన్ పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో వేసవికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ తస్లీమా మాట్లాడుతూ.. అజాగ్రత్తగా ఉంటే డీహైడ్రేషన్ వచ్చే ప్రమాదముందన్నారు. విద్యార్థులు వేసవిలో అనవసరంగా బయట తిరగరాదని, తప్పనిసరిగా మంచి నీరు, పళ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ బాగా తాగాలని సూచించారు. స్వచ్ఛ జలం తాగాలని, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వ్యక్తిగత జాగ్రత్తలతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడప్రదేశానికి తరలించి తడిగుడ్డతో శరీరం తడపాలని, ఉప్పు కలిపిన మజ్జిగ, చిటికెడు ఉప్పు కలిపిన గ్లూకోజ్ ద్రావణం, ఓఆర్ఎస్ ద్రావణం తాగించాలని తెలిపారు. వీలైనంత త్వరగా ఆసుపత్రికి తరలించాలన్నారు.

దారిలో గండాలు.. భయం గుప్పిట్లో జనాలు

☛ ప్రమాదకరంగా విద్యుత్తు నియంత్రికలు, స్తంభాలు

బేతంచెర్ల బైపాస్ దారిలో మురుగు కాల్వలో విద్యుత్తు స్తంభం

బేతంచెర్ల, డోన్ గ్రామీణ, న్యూస్‌టుడే: డోన్ నియోజకవర్గంలో పలుచోట్ల విద్యుత్తు నియంత్రికలు, స్తంభాలు దెబ్బతిని ప్రమాదకరంగా ఉన్నాయి. చర్యలు తీసుకోవాల్సిన విద్యుత్తు శాఖ అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు ఉన్నా కళ్లప్పగించి చూస్తున్నారు. కొన్ని గ్రామాల్లో నియంత్రికలు కూడళ్లు, నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. వీటి చుట్టూ రక్షణ ఏర్పాట్లు కూడా లేవు. అధికారులు విద్యుత్తు సమస్యలపై దృష్టిసారించి పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజల ఆందోళన

● బేతంచెర్ల పట్టణంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద, బైపాస్ రోడ్డులో ప్రధాన కాల్వలో విద్యుత్తు స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఎప్పుడు కూలిపోతుందోనని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. పట్టణంలో 7, 8వ వార్డుల్లో జెండా పేట కాలనీలో 60 ఏళ్ల క్రితం ఏర్పాటైన స్తంభాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వాటిని తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని కాలనీవాసులు విద్యుత్తు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు.

● వర్షాకాలంలో విద్యుదాఘాతానికి గురవుతున్నామని వాపోతున్నారు. తీగలు కిందికి వాలి ఉండటంతో ప్లాస్టిక్ పైపులు ఏర్పాటు చేశారు. దీని వల్ల ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోతున్నాయని అధికారులు స్పందించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా ఇనుప స్తంభాలను తొలగించి సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పరిశీలన

చర్యలు తీసుకోవాలని వినతి

● అంబాపురం గ్రామంలో బిల్డింగ్ ఏరియాలో చర్చికి వెళ్లే దారిలో విద్యుత్తు నియంత్రిక కిందికి ఉండటంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు.

● తవిశికొండ-హుస్సేనాపురం గ్రామాల మధ్యన చిన్న కొలుములపల్లె వెళ్లే దారిలో విద్యుత్తు తీగలు కిందికి వాలి ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ట్రాన్స్‌కో అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. అధికారులు స్పందించి టవర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

● డోన్ మండలంలోని గోసానిపల్లె సమీపంలో విద్యుత్తు స్తంభం ఒక పక్కకు వాలి పడిపోయేందుకు సిద్ధంగా ఉంది. దొరపల్లె గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో ఇళ్ల మధ్యన ఉన్న విద్యుత్తు స్తంభం నెరెలు ఇచ్చి ప్రమాదకరంగా ఉంది. వీటిని తొలగించి కొత్త స్తంభం ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

● డోన్ పట్టణంలోని ఆంధ్రా బ్యాంకుకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా ఉంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

చెరువుల పునరుద్ధరణకు ప్రాధాన్యం

డోన్, న్యూస్‌టుడే: చెరువుల పునరుద్ధరణతోనే నీటి నిల్వ పెరుగుతుందని, రైతులకు సాగునీరు అందుబాటులో ఉంటుందని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని వెంకటాపురం చెరువును ఆయన పరిశీలించారు. చెరువు ప్రస్తుత పరిస్థితులు, నీటి నిల్వ సామర్థ్యం, మరమ్మతుల అవసరాలు, భూగర్భజలాల స్థితిగతులపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. భూగర్భజలాల అందుబాటును పెంచే దిశగా ప్రభుత్వం స్పష్టమైన లక్ష్యాలు నిర్ణయించుకున్నట్లు తెలియజేశారు. వేసవి కంటే ముందుగా భూగర్భజలాలు 6 మీటర్ల ఎత్తు ఉంటే వర్షాకాలం పూర్తయ్యేనాటికి ఈలోతు 3 మీటర్లకు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. నీటి సంరక్షణ కోసం ప్రత్యేకంగా 100 రోజుల ప్రణాళికను తయారు చేశామన్నారు. అనంతరం అక్కడ జరుగుతున్న పలు అభివృద్ధి పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

చెరువు వద్ద పరిస్థితిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సూర్యప్రకాశ్‌రెడ్డి

ప్రమాదకర తీగలు.. పట్టించుకునేదెవరు



ఆళ్లగడ్డ మండలంలోని మర్రిపల్లె గ్రామంలో ప్రధాన విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా మారాయి. ఇళ్లను తాకుతూ విద్యుత్తు తీగలు వెళ్తున్నాయి. ఆవాసాల పైకప్పుపై తీగలు సునాయసంగా తగులుతుండటంతో ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు తీగలు తగలకుండా పైకప్పుపై కర్రలు ఏర్పాటు చేసుకున్నారు. విద్యుత్తు తీగలు తాకకుండా ఇంటికి దూరంగా ఉండేలా కర్రను ఏర్పాటు చేసిన దృశ్యాన్ని ఈ చిత్రంలో చూడవచ్చు. గాలులు, వర్షాలకు ఆ కర్ర తొలగిపోయే ప్రమాదముంది. అధికారులు దృష్టి సారించి విద్యుత్తు తీగలను సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు. – **న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ గ్రామీణం**

ఆదమరిస్తే.. గుంతలోకే..

చాగలమర్రి మండలంలోని మల్లెవేముల గ్రామ సమీపంలో రహదారి వెంట మట్టి కోసం తవ్విన గుంతలు ప్రమాదకరంగా మారాయి. నిత్యం చాగలమర్రి నుంచి మల్లెవేముల మీదుగా వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరుకు వేలాదిగా వాహనాలు వెళ్తుంటాయి. ప్రొద్దుటూరు, జమ్మలమడుగు వైపు నుంచి పదుల సంఖ్యలో ఇసుక ట్రాక్టర్లు కూడా వస్తుంటాయి. మల్లెవేముల సమీపంలో రహదారి పక్కన ఎలాంటి రక్షణ గోడ కూడా లేకుండా ప్రమాదకరంగా మారింది. అధికారులు స్పందించి రక్షణ గోడ, ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. – **న్యూస్‌టుడే, చాగలమర్రి**

అసంపూర్తి నిర్మాణాలు.. అందని సేవలు

బేతంచెర్ల మండలంలోని కొలుములపల్లె గ్రామంలో రైతు సేవా కేంద్రం, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ భవన నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. వైకాపా హయాంలో సుమారు రూ.40 లక్షల వరకు కేటాయించింది. తొలుత ఈ పనులు వేగంగా జరిగినా, తర్వాత బిల్లులు సకాలంలో రాకపోవడంతో ఎక్కడికక్కడ పనులు నిలిచి పోయాయి. విద్యుత్తు, తాగునీరు వంటి పనులు జరగాల్సి ఉంది. సంబంధిత అధికారులు స్పందించి వీటిని వినియోగంలోకి తీసుకరావడానికి చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. – **న్యూస్‌టుడే, బేతంచెర్ల**

విద్యుత్తు దీపాలు లేక అంధకారం

కోవెలకుంట్ల పట్టణ శివారులోని రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారిలో విద్యుత్తు దీపాలు లేకపోవడంతో రాత్రి వేళ కీకటిమయంగా మారుతోంది. చీకటి పడిందంటే స్టేషన్‌కు వెళ్లాలంటే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వీధి దీపాలు ఏర్పాటు చేయాలని పలుమార్లు ప్రయాణికులు రైల్వే ఉన్నతాధికారులకు విన్నవించినా చర్యలు తీసుకోవడం లేదని వాపోతున్నారు. దాదాపుగా ప్రధాన రహదారి నుంచి స్టేషన్‌కు కిలోమీటరు మేర ఇటువంటి సమస్య ఉంది. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – **న్యూస్‌టుడే, కోవెలకుంట్ల పట్టణం**

ఘనంగా గంగమ్మ తల్లికి పూజలు

పూజలందుకున్న గంగమ్మతల్లి

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ పట్టణంలో వకుళా నది ఒడ్డున వెలసిన గంగమ్మ ఆలయంలో సోమవారం భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. స్థానిక ఆలయంలో గంగమ్మ తల్లికి ప్రత్యేక జలంతో అభిషేకం చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ తాలూకా రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

దొర్నిపాడులో జాతరకు ఏర్పాట్లు

దొర్నిపాడు, న్యూస్‌టుడే: దొర్నిపాడు మండల కేంద్రంలో వెలసిన గణాది చౌడేశ్వరిదేవి, మహంకాళి అంకాలమ్మ దేవి, గంగాభవాని దేవి అమ్మవార్ల జాతర ఏర్పాట్లు చేస్తున్నట్లు గ్రామ పెద్దలు చెప్పారు. మే నెల 5, 6, 7వ తేదీల్లో జాతర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 13 ఏళ్ల తర్వాత ఈ జాతర నిర్వహిస్తున్నామన్నారు. గ్రామ ప్రజలు, భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆలయ హుండీ లెక్కింపు

మద్దూరు(చాగలమర్రి), న్యూస్‌టుడే: మండలంలోని మద్దూరు గ్రామంలో వెలసిన ప్రసన్న వెంకటేశ్వరస్వామి హుండీని సోమవారం లెక్కించారు. ఇటీవల వైకుంఠ ఏకాదశి పండగ, ఇతర పర్వదినాల సందర్భంగా భక్తులు హుండీలో వేసిన కానుకలను గ్రామ పెద్దల సమక్షంలో లెక్కించారు. మొత్తం రూ.42 వేల ఆదాయం వచ్చిందని గ్రామ పెద్దలు తెలియజేశారు.

శేషవాహనంపై స్వామి ఊరేగింపు

బేతంచెర్ల, న్యూస్‌టుడే: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని స్వామి అమ్మవారిని శేషవాహనంపై కొలువుంచి గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఛైర్మన్ మారుతీ కృష్ణ, ఉన్నేన్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వామి అమ్మవారికి షోడశోపచార, మహామంగళ హారతి నిర్వహించి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పారిశ్రామికవేత్త ఈవీ సుజాతశర్మ, శ్రీధర్‌రెడ్డి, వీరారెడ్డి, మలిపెద్ది బాలనాగిరెడ్డి, శ్రీను, రమణ తదితరులు పాల్గొన్నారు.

శేషవాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఊరేగింపు

జల సంరక్షణ చర్యలపై అవగాహన

ఆళ్లగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: నీటి భద్రతకు సాగు నీటి సంఘాలు చొరవ చూపాలని తెలుగు గంగ కాల్వ సాగు నీటి సంఘం జిల్లా ఛైర్మన్ సంజీవరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఓబులంపల్లె గ్రామంలో నీటి భద్రత సాగు నీటి సంఘాల బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నీటి సంరక్షణ చర్యలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం వీబీ జీ రామ్‌జీ పనుల్లో భాగంగా చేపడుతున్న కాల్వ పూడికతీతను పరిశీలించారు. కార్యక్రమంలో వాటర్‌యూజ్ అసోసియేషన్ సభ్యులు తహసీల్దారు జ్యోతిరత్నకుమారి, ఎంపీడీవో నూర్జహాన్, ఏపీవో ప్రతాప్, వెంకటరామిరెడ్డి, శివారెడ్డి, పాపిరెడ్డి పాల్గొన్నారు.

ఓబులంపల్లెలో కాల్వ పూడికతీత పనుల పరిశీలనలో అధికారులు

అక్రమ తవ్వకాలు ఆపాలని వినతి

బనగానపల్లి, బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: బనగానపల్లి మండలం పలుకూరులో రామేశ్వరస్వామి ఆలయ భూముల్లో నాపరాళ్ల గనుల అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. ఆలయ పూజారి భాస్కరయ్య తహసీల్దారు కార్యాలయంలో ఆర్డీవో నరేంద్రనాథ్‌రెడ్డి, తహసీల్దారు నారాయణరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన కొందరు అక్రమార్కులు సర్వే నెంబరు 308లో ఉన్న రెండెకరాలకు పైగా భూమిలో నాపరాళ్లను వెలికి తీసి సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. ఇలాగే కొనసాగితే కొన్నేళ్లకు ఆలయం భూమి కనుమరుగై పోతుందని తెలిపారు. ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తవ్వకాలు ఆపేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

రెవెన్యూ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న భాస్కరయ్య

ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టాలి

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెదేపా జిల్లా నాయకులు, మాజీ ఎంపీపీ అంబాల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. రామతీర్థం గ్రామంలో నీటి పారుదలశాఖ ఆధ్వర్యంలో నీటి భద్రత- సాగునీటి సంఘాల బాధ్యత అనే కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నీటి ప్రాధాన్యాన్ని వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ మల్లికార్జునరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, తెదేపా నాయకులు, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, తెదేపా నాయకులు

ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే: జల సంరక్షణ అందరి బాధ్యత కావాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అన్నారు. ఉయ్యాలవాడ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నీటి భద్రత- సాగునీటి సంఘాల బాధ్యత అన్న అంశంపై ఏర్పాటైన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. భూగర్భ జలాలను పెంపొందించేందుకు చెరువులు, కుంటల పునరుద్ధరణ చేపట్టాలన్నారు. పంట కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టాలన్నారు.

కుక్కలు.. బాబోయ్ తిప్పలు

బనగానపల్లి, అవుకు, న్యూస్‌టుడే: బనగానపల్లి పట్టణంలో వీధి కుక్కల బెడద ఎక్కువైపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ వీధిలో చూసినా కుక్కలు గుంపులుగా తిరుగుతూ జనాలకు భయభ్రాంతుకు గురిచేస్తున్నాయి. ఫిబ్రవరి 25న బీసీ కాలనీలో ఒక పిచ్చికుక్క 30 మందిపై దాడి చేసి కరిచింది. కుక్కల సమస్యల గురించి మేజర్ పంచాయతీ సమావేశాల్లో ప్రస్తావించినా ఫలితం లేకుండా పోయింది. ప్రతి వీధిలో 10 నుంచి 20 కుక్కల వరకు దర్శనమిస్తున్నాయి.

అదొక ప్రహసనం

వీధి కుక్కలను పట్టుకొని వాటికి సంతాన పునరుత్పత్తి లేకుండా శస్త్రచికిత్స చేయాల్సి ఉంది. ఇందు కోసం నైపుణ్యం కలిగిన వైద్యులు ఉండాలి. కుక్కల క్యాచింగ్, రవాణా చేయడానికి ఒక వాహనం ఏర్పాటు చేసుకోవాలి. పట్టుకున్న వాటికి ఆపరేషన్ చేయడానికి ఆపరేషన్ థియేటర్ ఉండాలి. ఇలా కుక్కల బెడదను ప్రజలకు తొలగించడం ఒక ప్రహసనం అవుతోంది.

వీధుల్లో తిరుగుతున్న శునకాల గుంపు

అసుపత్రి పాలవుతున్న బాధితులు

● ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిత్యం పలు కాలనీల నుంచి ప్రజలు కుక్కకాటుకు గురై ఆసుపత్రుల పాలవుతున్నారు. ఇక్కడ వంద పడకల ఆసుపత్రి ఉండటంతో సూదిమందు అందుబాటులో ఉండి సరిపోతుంది. లేకపోతే ప్రయివేటు ఆసుపత్రులకు వెళ్లి రూ.వేలు ఖర్చు పెట్టుకునే పరిస్థితి ఉండేది.

● బనగానపల్లి పట్టణంలో 40 వేల జనాభా ఉంది. కుక్కల సంఖ్య దాదాపు వెయ్యి దాకా ఉండవచ్చని అంచనా. ఇప్పటి వరకు 100 దాకా పట్టుకుని ఇంజెక్షన్లు ఇచ్చారు. కుక్కలు గుంపులు గుంపులుగా కాలనీల్లో తిరగడం అదే స్థాయిలో బాధితుల సంఖ్య పెరిగిపోతోంది. సాధ్యమైనంత వరకు కుక్కలను పట్టుకొని పునరుత్పత్తి లేకుండా చేయాలని పుర ప్రజలు కోరుతున్నారు.

● అవుకు మండలంలోని నాలుగు గ్రామాల్లో మూడు నెలల కాలంలో దాదాపు 40 మంది కుక్కకాటుకు గురయ్యారు. అవుకులో రెండు ప్రాంతాల్లో ఆరుగురు కాటుకు గురికాగా సుంకేసుల, మంగంపేట, మెట్టుపల్లె పరిసరాల్లో మరో 24 మంది కాటుకు గురయ్యారు. బాధితుల్లో మహిళలు, చిన్న పిల్లలు ఉన్నారు. పెచ్చు పెరిగిన కుక్కలను అదుపు చేయాలంటూ పదేపదే విన్నవించినా పట్టించుకునే వారే లేరని గ్రామస్థులు వాపోతున్నారు.

చర్యలు తీసుకుంటాం - సతీష్‌కుమార్‌రెడ్డి, ఈవో, బనగానపల్లి

కుక్కలను పట్టుకునేందుకు ఉన్నత స్థాయి అధికారులకు నివేదిక పంపిస్తాం. పట్టుకునేందుకు అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. గతంలో కొన్నింటిని పట్టుకొని వైద్యుల పర్యవేక్షణలో సూది మందులు వేశాం. అధికారుల అనుమతులు వస్తే తప్పకుండా వీధి శునకాలు తగ్గించేందుకు చర్యలు చేపడతాం.

సంక్షిప్త సమాచారం

సర్పంచులకు సన్మానం నేడు: ఆళ్లగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ మండల పరిషత్ కార్యాలయంలో నేడు సర్పంచులకు సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నూర్జహాన్ తెలిపారు. సర్పంచుల పదవి కాలం పూర్తైన సందర్భంగా సన్మానం చేస్తున్నట్లు తెలిపారు.

మృతికి నివాళి: చాగలమర్రి, న్యూస్‌టుడే: మండలంలోని గొడిగనూరు గ్రామానికి చెందిన తెదేపా నాయకుడు నరసింహారెడ్డి(55) గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. తెదేపా మండల కన్వీనర్ నరసింహారెడ్డి, తెదేపా నంద్యాల పార్లమెంటరీ బీసీ సెల్ స్పోక్స్‌పర్సన్ సల్లా నాగరాజు మృతికి నివాళి అర్పించారు.

విచారణ చేపట్టాలి: డోన్, న్యూస్‌టుడే: కర్ణాటకలోని శివమొగ్గలో నీటి ఏనుగు దాడిలో పశువైద్యురాలు సమీక్షరెడ్డి మృతిచెందిన విషయం తెలిసిందే. పాతకర్నూల్‌లో సోమవారం పశుసంవర్ధక శాఖ ఏడీ డా.నాగరాజు ఆధ్వర్యంలో పశువైద్యులు నిరసన చేపట్టి మృతిపై పారదర్శకంగా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

తడిసిన ధాన్యం: కోవెలకుంట్ల గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి మిరప, మొక్కజొన్న దిగుబడులు తడిచాయి. అర్ధరాత్రి అకస్మాత్తుగా వర్షం కురవడంతో రైతులు అవస్థలు పడ్డారు.

మృతదేహానికి అంత్యక్రియలు: ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ పట్టణంలో పాతూరు వీధిలో నివసించే ఓ అనాథ మృతి చెందారు. విషయం తెలుసుకున్న సమాజ సేవకుడు డాక్టర్ ఈపన గండ్ల శ్రీనివాసులు అతని బృందంతో కలిసి మృత దేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

ఓబులేసు, సత్యం, మౌలాలి పాల్గొన్నారు.

సాగు విధానంపై అవగాహన: అవుకు, న్యూస్‌టుడే: నీటి ఆధారిత వ్యవసాయ పద్ధతులపై రైతులు ప్రత్యేక దృష్టిసారించాలని ఏవో ఖలీమున్నీసా సూచించారు. సాగు విధానంపై సోమవారం వ్యవసాయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. **ప్రజా ఫిర్యాదులకు 12 దరఖాస్తులు: బేతంచెర్ల, న్యూస్‌టుడే:** తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో మొత్తం 12 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ నాగమణి సోమవారం తెలిపారు.

ప్రజా సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ ధ్యేయం

☛ ఘనంగా భాజపా ఆవిర్భావ దినోత్సవం

కోవెలకుంట్ల పట్టణంలో చేడుకలు

ఆళ్లగడ్డ, బేతంచెర్ల, ప్యాపిలి, కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ ధ్యేయమని పలువురు భాజపా నాయకులు పేర్కొన్నారు. భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం పట్టణాలు, గ్రామాల్లో పార్టీ పతాకాన్ని ఎగురవేసి సంబరాలు నిర్వహించారు. పేద ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టిన ఘనత దేశ ప్రధాని నరేంద్ర మోదీకే దక్కుతుందని భాజపా నాయకులు పేర్కొన్నారు. బేతంచెర్లలో భాజపా జిల్లా కార్యదర్శి నాగమోహన్, మండల, పట్టణ అధ్యక్షులు గుండా అశ్వర్థ నారాయణ, ఆంజనేయులు, నాయకులు అంబటి సుబ్బారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, మోహన్‌రావు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: పతాక ఆవిష్కరణలో బోరెడ్డి లక్ష్మీరెడ్డి

బేతంచర్ల: ఆర్ఎస్ రంగాపురంలో..